సాక్షి రంగారెడ్డి

శుక్రవారం : 16 : ఆగస్టు : 2024



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న వేంసరేందర్ రెడ్డి తదితరులు



శత్రువులపై గురి పెడతాం.. దేశాన్ని రక్షించుకుంటాం..

న్యూస్‌రీల్

మూడో విడత.. 11,239 మందికి మాఫీ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మూడో విడత పంట రుణాల మాఫీలో భాగంగా జిల్లాలో 11,239 మందికి లబ్ధి చేకూరింది. ప్రభుత్వం రూ.185.40 నగదును 15,226 రైతుల కుటుంబాలకు సంబంధించిన ఖాతాల్లో గురువారం జమ చేసింది. రూ.రెండు లక్షలలోపు రుణాల మాఫీలో భాగంగా తొలి విడతలో 49,471 మంది ఖాతాల్లో రూ.257.19 కోట్లు జమ చేయగా, రెండో విడతలో 22,915 మంది రైతుల ఖాతాల్లో రూ.218.13 కోట్లు జమ చేసింది. మూడు విడతల్లో మొత్తం 83,625 మంది రైతుల ఖాతాల్లో రూ.660.72 కోట్ల నగదును జమ చేసింది. రూ.2 లక్షలకు మించిన రైతుల రుణాలు మాఫీ కాలేదు. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

'డబుల్' ఇళ్లకు సదుపాయాలు

టెండర్లు ఆహ్వానించిన జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో వివిధ కాలనీల్లో లబ్ధిదారులకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో సదుపాయాలు కల్పించకపోవడంతో వారు వాటిలో ఉండటంలేదు. గత సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలోనూ కొన్ని ప్రాంతాల ప్రజలు సదుపాయాల లేమిపై ఫిర్యాదు చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ సమయంలోనే తాగునీరు, శానిటరీ, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పించినప్పటికీ, చాలా కాలం వరకు లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించనందున కొన్ని ప్రాంతాల్లో పైపులు, విద్యుత్ తీగలు, శానిటరీ పరికరాలను దొంగలు ఎత్తుకెళ్లారు. కొన్ని ప్రాంతాల్లో దెబ్బతిని మరమ్మతులకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల నుంచి వెల్లువెత్తుతున్న ఫిర్యాదులతో తిరిగి వాటిని సమకూర్చేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ప్రస్తుతం శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో కొత్తవి ఏర్పాటు చేసేందుకు జీహెచ్ఎంసీ టెండర్లు ఆహ్వానించింది. టెండర్లు పూర్తి చేసి పరికరాలు సమకూర్చుకొని, అమర్చనుంది.

హైదరాబాద్‌ను ఆదర్శంగా నిలుపుదాం

కలెక్టర్ అనుదీప్



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలోనే హైదరాబాద్ ఆదర్శంగా నిలిచేలా అందరం కృషి చేద్దామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టతకు, సమగ్రాభివృద్ధికి కంకణబద్ధులం కావాలన్నారు. జిల్లాలో సంక్షేమ పథకాల అమలుపై వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ఆయన అవార్డులను అందజేశారు.

దొంగిలించిన క్రెడిట్ కార్డులతో విమాన టికెట్లు

సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్ కేంద్రంగా పని చేసే ఎయిర్ టికెటింగ్ సంస్థ ఉద్యోగిని ట్రాప్ చేసిన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దొంగ క్రెడిట్ కార్డులతో విమాన టికెట్లు ఖరీదు చేశారు. ఇలా రూ.1.59 కోట్ల విలువైన 118 టికెట్లు బుక్ చేసుకున్న తర్వాత విషయం సదరు సంస్థ గుర్తించింది. నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) అధికారులను ఆశ్రయించడంతో కేసు నమోదైంది. బంజారాహిల్స్ కేంద్రంగా పని చేసే ట్రావెల్ కంపెనీ ఇండియన్ ఈగల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వివిధ విమానయాన సంస్థలకు చెందిన జాతీయ, అంతర్జాతీయ విమాన టికెట్లను ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. గత మేలో ఆన్‌లైన్ చాట్‌లో ఈ సంస్థను సంప్రదించిన గుర్తుతెలియని వ్యక్తులు విమాన టికెట్ల వివరాలపై ఆరా తీశారు. ఆ సమయంలో వారితో నితీష్ అనే ఉద్యోగి సంప్రదింపులు జరిపారు. ఆ సందర్భంలో అతడి వ్యక్తిగత ఫోన్ నంబర్‌ను దుండగులు తీసుకున్నారు. మే 28 నుంచి వివిధ క్రెడిట్ కార్డులు వినియోగించి బడే అభిషేక్, పర్వీజ్ అహ్మద్ నూర్ మహ్మద్ హోర, గుండు రాణి సహా మరికొంత మంది పేర్లతో 118 విమాన టికెట్లు బుక్ చేశారు. దీనికి సంబంధించి నితీష్‌కు రూ.82,500 కమీషన్ రూపంలో అతడి బ్యాంకు ఖాతాలో జమ చేశారు. వీరు వినియోగించినవి వివిధ ప్రాంతాల్లో చోరీ అయిన క్రెడిట్ కార్డుల అని వరుసగా వచ్చిన ఫిర్యాదులతో ట్రావెల్ కంపెనీ యాజమాన్యం గుర్తించింది. పక్కా పథకం ప్రకారం వ్యవహరించి తమ సంస్థను మోసం చేశారని రూ.1,59,18,900 నష్టం జరిగిందంటూ సంస్థ ఆపరేషన్ డైరెక్టర్ రమేష్ కంద్రకోట సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

హామీలను నెరవేరుస్తూ అభివృద్ధికి బాటలు

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

- ప్రగతిలో దూసుకుపోతున్న జిల్లా
- సీఎం సలహాదారు వేంసరేందర్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో ఘనంగా స్వాతంత్ర్య సంబరాలు
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'ఎన్ని అవరోధాలు ఎదురైనా.. ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తుంది. ఒకవైపు సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే.. మరోవైపు దేశవిదేశాల నుంచి పారిశ్రామిక పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆకర్షిస్తూ.. జిల్లాను అభివృద్ధి పథంలో ముందు వరుసలో నిలబెడుతుంది. ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించి, తలసరి ఆదాయంలో తెలంగాణలోనే ప్రథమ స్థానంలో నిలిపింది. ఇతర జిల్లాలతో పోలిస్తే రంగారెడ్డి అభివృద్ధిలో దూసుకుపోతోంది' అని సీఎం సలహాదారు వేంసరేందర్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ శశాంకతో కలిసి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వేంసరేందర్‌రెడ్డి జిల్లా అధికారులు, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

358 మంది బాలబాలికలకు విముక్తి

జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ ద్వారా ఇప్పటి వరకు 358 మంది బాలబాలికలకు విముక్తి కల్పించడం జరిగింది. కాలుష్య రహిత నగరంగా మీర్‌ఖాన్‌పేట్‌ను తీర్చిదిద్దుతున్నాం. ఇప్పటికే రూ.100 కోట్ల అంచనా వ్యయంతో నైపుణ్యాభివృద్ధి వర్సిటీకి శంకుస్థాపన చేసుకున్నాం. స్పోర్ట్స్ యూనివర్సిటీ సహా స్పోర్ట్స్ హబ్‌ను ఏర్పాటు చేయబోతున్నాం. ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, కుంటల పరిరక్షణ కోసం హైడ్రాను అందుబాటులోకి తెచ్చాం. మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్నాం. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల ముందుకు తీసుకెళ్లి, రాష్ట్రంలోనే జిల్లాను అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నాం.



మహిళా సమాఖ్యకు చెక్కు అందిస్తున్న వేంసరేందర్ రెడ్డి, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు తదితరులు

అధికారులకు ప్రశంసాపత్రాలు

ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన పలువురు అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, కార్పొరేషన్ల చైర్మన్లు చల్లా నర్సింహారెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మహేశ్వరం డీసీపీ సనీతారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏఓ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాప్రదర్శనలు

వేడుకల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కళారూపాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 'రుధిర నేత్ర అరుణ అరుణ తెల్లవాడి గుండెలదరగొట్టింది ఆ తరం' గీతానికి కడ్తాల్ కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యరూపకం విశేషంగా ఆకట్టుకుంది. 'చెక్ దే ఇండియా' దేశభక్తి గీతానికి నాదర్‌గుల్ ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ చిన్నారులు ప్రదర్శించిన నృత్యరూపకం, 'ఎత్తర ఈ జెండా' అంటూ ఎల్బీనగర్ అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకం, కార్గిల్ యుద్ధం అంశాన్ని థీమ్‌గా తీసుకుని తుర్కయంజాల్ చిల్డ్రన్స్ హోమ్స్ విద్యార్థులు ప్రదర్శించిన కళారూపకం విశేషంగా అలరించాయి. జెడ్పీహెచ్ఎస్ తుక్కుగూడ విద్యార్థులు 'బంజారా తెలంగాణ సాంస్కృతిక వైభవం' గీతానికి ప్రదర్శించిన నృత్యరూపకం కార్యక్రమంలో హైలెట్‌గా నిలిచింది. అనంతరం అతిథులు చిన్నారులకు బహుమతులను అందజేశారు.

ఏరియా ఆస్పత్రి అప్‌గ్రేడ్

ఎంబీబీఎస్ చదవాలనేది ప్రతి ఒక్కరి కల. నేటి పరిస్థితుల్లో పేదలు వైద్య విద్యను చదవలేని పరిస్థితి నెలకొంది. పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయాలనే సంకల్పంతో మహేశ్వరంలో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తున్నాం. వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసి, దీనికి అనుసంధానించబోతున్నాం. పేదలందరికీ సూపర్ స్పెషాలిటీ సేవలు అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. చేయూత పథకం ద్వారా జిల్లాలో 1,99,587 మందికి రూ.48.04 కోట్లు నెలవారీ పెన్షన్లు పంపిణీ చేశాం. 2024–25 ఆర్థిక సంవత్సరానికి 15,570 వ్యవసాయేతర సంఘాలకు రూ.580.39 కోట్ల రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకుని ఇప్పటి వరకు 2,917 సంఘాలకు రూ.270.82 కోట్లు అందజేశాం. స్త్రీనిధి సంస్థ ద్వారా మహిళలకు రూ.74.80 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించి, ఇప్పటి వరకు రూ.3.20 కోట్లు ఇవ్వడం జరిగింది.

అర్హులందరికీ 'అభయహస్తం'

ఆరు గ్యారంటీల అమలు కోసం జిల్లాలో 5,9,849 మంది దరఖాస్తులు స్వీకరించి, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తున్నాం. మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు 14.59 కోట్ల మంది మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. ఇందుకు ఇప్పటి వరకు రూ.355 .74 కోట్లు చెల్లించాం. రూ.500కే వంటగ్యాస్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 1,43,946 సిలిండర్లకు రూ.4.30 కోట్లు చెల్లించాం. 200 యూనిట్లలోపు విద్యుత్ వాడిన 3.33 లక్షల కుటుంబాలకు జీరో విద్యుత్ బిల్లులు జారీ చేశాం. ఇందుకు రూ.12.62 కోట్లు డిస్కంకు చెల్లించాం. రైతు రుణమాఫీలో భాగంగా మొదటి విడతలో 49, 471 మంది రైతులకు రూ.257.19 కోట్లు, రెండో విడతలో 22,915 మంది రైతులకు రూ.218.13 కోట్లు మాఫీ చేశాం. జిల్లాలో 1,342 పాఠశాలలు ఉండగా, వీటిలో 762 అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేసి, రూ.22.30 కోట్లు మంజూరు చేశాం.

అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కమిషనర్ ఆమ్రపాలి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డిలతో కలిసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించే దిశగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో బల్దియాకు రూ.3,065 కోట్లు కేటాయించడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో ఖైరతాబాద్, ఎల్బీనగర్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ్ అగర్వాల్, అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, కె. శ్రీనివాసరావు, శివకుమార్ నాయుడు, యాదగిరి రావు, సత్యనారాయణ, నళిని పద్మావతి, గీతా రాధిక, సరోజ, పంకజ, మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

జవాన్లు, రైతుల సేవలు మరువలేనివి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మహేశ్వరం: దేశ రక్షణలో జవాన్లు, అన్నం పెట్టే రైతుల సేవలు మరువలేనివని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమీర్‌పేట్ గ్రామంలోని అటల్ బిహారీ వాజ్‌పేయ్ హరిబాబు నర్సరీలో గురువారం ఆర్మీ మాజీ జవాన్లు, రైతులను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను లెక్కచేయకుండా సరిహద్దుల్లో సేవలందిస్తున్న జవాన్లకు అభినందనలు తెలిపారు. దేశ రక్షణకు పాటుపడుతున్న జవాన్లు, పంటలు పండించి తిండి పెడుతున్న రైతన్నలు దేశానికి ముఖ్యమన్నారు. నాయకులు, కార్యకర్తలు కేంద్రంలో ప్రధాని మోదీ అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని సూచించారు. అంతకు ముందు జాతీయ జెండాను ఆవిష్కరించి, ఆర్మీ మాజీ జవాన్లు, రైతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పోతర్ల సుదర్శన్ యాదవ్ పాల్గొన్నారు.



ఆర్మీ మాజీ జవాన్లు, రైతులను సన్మానించిన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

సిటీ బ్యూటీ'ఫుల్'

జంక్షన్లు తదితర ప్రాంతాల్లో సుందరీకరణకు ప్రణాళికలు

- ఆకట్టుకునేలా వివిధ థీమ్‌లతో ఆకృతులు, శిల్పాలు
- డిజైన్లు, పనుల పర్యవేక్షణ కోసం నిపుణుల సహకారం





సాక్షి, సిటీబ్యూరో: భాగ్య నగరం మరిన్ని సొబగులు అద్దుకోనుంది. సిటీ బ్యూటీఫుల్‌గా మారనుంది. హైదరాబాద్‌ను అందంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జీహెచ్ఎంసీ చర్యలకు సిద్ధమవుతోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు పలు రాష్ట్రాలు, విదేశాల నుంచి సైతం ఎందరో నగరానికి వస్తున్నందున వారిని ఆకట్టుకునేలా ఆయా ప్రాంతాలు కనిపించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో జంక్షన్లతో పాటు అవకాశమున్న అన్ని ప్రాంతాలను అందంగా, కనువిందు చేసేలా తీర్చిదిద్దాలనీ జీహెచ్ఎంసీ భావిస్తోంది.

టెండర్ల నుంచి పనులు పూర్తయ్యే దాకా..

ఇప్పటికే నగరంలోని పలు జంక్షన్లు, ఆయా విగ్రహాలు, కళాకృతులతో పలువురిని ఆకట్టుకుంటుండటం తెలిసిందే. మరిన్ని జంక్షన్లతో పాటు ఫ్లై ఓవర్లు, ఆర్‌యూబీలు, అండర్‌పాస్‌లు తదితర ప్రాంతాలను బ్యూటీఫుల్‌గా మార్చేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందుకోసం నిపుణులైన, తగిన అర్హతలున్న ఆర్కిటెక్టుల జాబితాను సైతం తయారు చేయనున్నారు. ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు సుందరీకరించేందుకు వారి ఆలోచనలు, ప్రణాళికలు తదితరాలను పరిగణనలోకి తీసుకుంటారు. అంతేకాదు.. టెండర్లను ఆహ్వానించడం నుంచి పనులు పూర్తయ్యేంతదాకా కూడా వారి సహకారం తీసుకుంటారు. తద్వారా పనులు త్వరితంగా పూర్తయ్యేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ల్యాండ్‌స్కేపింగ్ నుంచి మొదలుపెడితే ప్రత్యేక థీమ్‌లతో ఆయా ప్రాంతాలను సుందరీకరించేందుకు వారి సేవలు పొందనున్నారు. కళాకృతులు తయారు చేసేందుకు అవసరమైన మెటీరియల్, రంగులు నాణ్యమైనవి, మన్నికతో కూడినవి ఎంపిక చేసేందుకూ వారి సహకారం తీసుకోనున్నారు.

ఈ ప్రాంతాల్లో సుందరీకరణ..

సుందరీకరణ పనుల కోసం ఇప్పటికే కొన్ని ప్రాంతాలను ఎంపిక చేశారు. మరిన్ని ప్రాంతాలను త్వరలోనే ఎంపిక చేయనున్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన ప్రాంతాల్లో శేరిలింగంపల్లి జోన్‌లోని జేఆర్‌సీ రోడ్ ఎంట్రెన్స్, కిడ్నీ ఐలాండ్ జంక్షన్, శిల్పారామం, బయో డైవర్సిటీ, గచ్చిబౌలి ఫ్లై ఓవర్, నల్లగండ్ల– గోపన్‌పల్లి రోటరీ గచ్చిబౌలి స్టేడియం, ఖాజాగూడ కారిడార్ జంక్షన్లు ఉన్నాయి. మిగతా జోన్లలోనూ ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, ఆర్‌యూబీలు, చౌరస్తాలు తదితర ప్రాంతాల్లోనూ సుందరీకరణ పనులు చేపట్టనున్నారు.

పరిస్థితులకనుగుణంగా..

నగరంలోని ఆయా జంక్షన్ల సమీపంలో క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా కళాత్మకత ఉట్టిపడేలా, తగిన డిజైన్లతో, వివిధ థీమ్‌లతో సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. కళాత్మకంగా కనిపించే చెక్కలు, శిల్పాలు, ఇటాలియన్ డిజైన్ విద్యుత్ స్తంభాలు, ఫౌంటెన్లు, వాటర్‌ఫాల్స్ వంటి వాటితో అందమైన, ఆకట్టుకునే ప్రాంతాలుగా తీర్చిదిద్దనున్నారు.





క్లుప్తంగా

అడ్డు గోడలు తొలగించాలి



చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

తుర్కయంజాల్: లింక్ రోడ్లకు అడ్డుగా ఉన్న ప్రహరీ గోడలను తొలగించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని రాజ్ రంజిత్ ప్రైమ్ హోమ్స్ నుంచి సమీప కాలనీలకు ఉన్నటువంటి లింక్ రోడ్లకు అడ్డంగా ఉన్న గోడలను తొలగించాలని గురువారం శివాజీనగర్, అన్నపూర్ణ కాలనీవాసులు మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్ రజింత్ హోమ్స్‌లో తరచూ రోడ్డును మూసివేయడం, అక్కడ గుంతలు తీయడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే స్పందించి లింక్ రోడ్లను తొలగించాలన్నారు. సుమారు 10 కాలనీల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని విన్నవించారు. దీనికి చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు భాస్కర్‌రెడ్డి, యాదగిరి, శంకర్‌రెడ్డి, తులసీరాం, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్ఐ వరప్రసాద్



తలకొండపల్లి: ఎంపీడీఓ శ్రీకాంత్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ శశాంక



తుక్కుగూడ: కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్



కడ్తాల్: ప్రశంసా పత్రం అందుకుంటున్న తహసీల్దార్ ముంతాజ్



కందుకూరు: ఎంపీడీఓ సరితకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి



చేవెళ్ల: ప్రశంసాపత్రంతో కంప్యూటర్ ఆపరేటర్ సర్దార్



మొయినాబాద్: ఉత్తమ అవార్డు అందుకుంటున్న ఏఎన్ఎం శోభారాణి



చేవెళ్ల: సబార్డినేట్ కృష్ణ

అధికారుల సేవకు పురస్కారాలు

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అవార్డులు

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ సేవలందించిన అధికారులకు గురువారం ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లాలో నిర్వహించిన వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శశాంక జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. అనంతరం జిల్లాలో పాలనా పరంగా ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. – సాక్షి, నెట్‌వర్క్



చేవెళ్ల: కలెక్టర్ శశాంక నుంచి అవార్డు అందుకుంటున్న ఎంపీఓ విఠలేశ్వర్‌జీ



ఇబ్రహీంపట్నం రూరల్: సీఐ రవీందర్‌కు ప్రశంసాపత్రం



మహేశ్వరం: ప్రశంసాపత్రంతో ఎపీఎం సత్యనారాయణ



ఇబ్రహీంపట్నం రూరల్: ప్రశంసాపత్రంతో సీఐ రాఘవేందర్‌రెడ్డి



మొయినాబాద్‌రూరల్: సూపరింటెండెంట్ రహమాన్

అదనపు కట్నం.. అతివకు శాపం

- ఎక్సైజ్ కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య

పహాడీషరీఫ్: ఎక్సైజ్ కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య చేసుకోవడం పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివాదాస్పదంగా మారింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురానికి చెందిన నిఖిల్ సోదరి బరిగెల మౌనికను ఎక్సైజ్ కానిస్టేబులైన శ్రీకాంత్‌గౌడ్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేశారు. అప్పుడు రూ.40 లక్షల వరకు కట్నం చెల్లించారు. వీరికి ఒక కుమారుడు జన్మించినప్పటికీ.. భార్యాభర్తల నడుమ గొడవలు కొనసాగుతూ వస్తున్నాయి. అత్తింటి వారు అదనంగా రూ.25 లక్షలు కట్నం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన మౌనిక బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గురువారం ఈ విషయమై ఇరు కుటుంబాలతో పాటు రాజకీయ నాయకులు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ వద్ద భారీగా గుమిగూడారు. పోలీసులు అందరిని సముదాయించి బయటికి పంపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

జెండావిష్కరణలో అపశ్రుతి

శంకర్‌పల్లి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని 2వ వార్డు కౌన్సిలర్ సంధ్యారాణి వార్డు కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో జాతీయ జెండాని ఎగరవేశారు. అయితే ఉప కేంద్రం వద్ద జెండా ఆవిష్కరణలో అపశ్రుతి చోటుచేసుకుంది. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కౌన్సిలర్ తలకిందులుగా ఉన్న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సరిచేసి జెండాను ఎగరవేశారు.

మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

శంకర్‌పల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన గురువారం మండలంలోని ఇంద్రారెడ్డి నగర్‌లో చోటుచేసుకుంది. మోకిల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రారెడ్డినగర్ చౌరస్తా సమీపంలో సైకిల్ ట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి(55) మృతి చెంది ఉన్నట్లు స్థానికులు పోలీసులకు బుధవారం అర్ధరాత్రి సమాచారం చేరవేశారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి అనంతరం మాట్లాడారు. అనారోగ్య సమస్యలతో మృతి చెంది ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రక్తదాతకు చిరంజీవి అభినందన

52 సార్లు రక్తాన్ని దానం చేసిన డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి



మహేంద్రకుమార్‌రెడ్డిని అభినందిస్తున్న సినీనటుడు చిరంజీవి

కందుకూరు: లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించిన శిబిరంలో 52వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి ఆయన గురించి తెలుసుకుని ప్రత్యేకంగా అభినందించారు. ఇదే ఒరవడి కొనసాగించి అందరికీ మార్గదర్శకంగా ఉండాలని కోరారు. మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. గత పాతికేళ్లుగా వివిధ సందర్భాల్లో స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాలు నిర్వహించి యువతలో రక్తదానం పట్ల అపోహలు తొలగించి, రక్తదానం చేసేలా అవగాహన కల్పించామన్నారు. ప్రతి ఆరోగ్యవంతుడు ఏడాదికి మూడు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. రక్తం కృత్రిమంగా ప్రయోగశాలల్లో తయారు కాదని, ఆపదలో ఉన్న మనుషులను ఆదుకునేలా ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ డి.కోటేశ్వరరావు, సెకండ్ వైస్ గవర్నర్ సురేష్‌జాగ్నాని, క్యాంప్ చైర్మన్ సారంగపాణి, యాదయ్యగౌడ్, తాళ్ల అంజయ్య, ఆనంద్ చెక్కిళ్ల, భరత్‌రాజ్ పాల్గొన్నారు.

జెండా రోజు మద్యం విక్రయాలు

- వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

శంకర్‌పల్లి: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన గురువారం మోకిల ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండకల్ గ్రామంలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్న నర్సింహారెడ్డి స్వాతంత్య్ర దినోత్సవం రోజు మద్యం విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడులు జరిపారు. అతని వద్ద సుమారు రూ.50 వేల విలువ గల 25 లీటర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మోకిల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి, కేసు నమోదు చేయించారు.

విధి నిర్వహణలో నిజాయితీ అవసరం

– వీజీ అకాడమీ డైరెక్టర్ సతీష్‌కుమార్

మీర్‌పేట: తమ ఇనిస్టిట్యూట్ ద్వారా శిక్షణ పొంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు విధి నిర్వహణలో నిజాయితీ అలవర్చుకోవాలని వీజీ అకాడమీ డైరెక్టర్ వి.సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) గెజిటెడ్ పరీక్షలో ఇనిస్టిట్యూట్ విద్యార్థులు విజయం సాధించిన సందర్భంగా గురువారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ రాఘవేంద్రనగర్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. గెజిటెడ్ స్థాయి అనేది ఎంతో బాధ్యత కలిగిన పదవి అని, గ్రీన్‌పెన్‌తో పెట్టే ప్రతీ సంతకం ఆ బాధ్యతను గుర్తుచేయాలని సూచించారు. అనంతరం 200 మందికి పైగా ఎంపికైన సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు గ్రీన్‌పెన్, మెమెంటోలను అందజేసి సత్కరించారు.



ఉద్యోగాలు సాధించిన వారితో వీజీ అకాడమీ డైరెక్టర్ సతీష్‌కుమార్

పెట్రోల్‌లో నీళ్లు!

ఆందోళనకు దిగిన వాహనదారులు



కల్తీ పెట్రోల్‌ను చూపుతున్న వాహనదారుడు

షాద్‌నగర్ రూరల్: పెట్రోల్‌లో నీళ్లు కలిపారని వాహనదారులు ఆందోళనకు దిగిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బుచ్చిగూడ శివారులో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి... ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామానికి చెందిన శివ తన పల్సర్ బైక్‌లో రూ.300 పెట్రోల్ పోయించుకొని గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో బైక్ ఆగిపోయింది. బైక్‌ను స్టార్ట్ చేసుకొని కొద్ది దూరం వెళ్లగానే మళ్లీ ఆగిపోయింది. ఎంత ప్రయత్నించినా స్టార్ట్ కాకపోవడంతో మెకానిక్‌ను పిలిపించాడు. పెట్రోల్ ట్యాంకును విప్పి అందులోని పెట్రోల్‌ను బాటిల్‌లో నింపి చూశారు. అందులో నీళ్లు ఉన్నట్లుగా గుర్తించారు. దీంతో సాయంత్రం బంకు వద్దకు చేరుకొని నిర్వాహకులను నిలదీశారు. అటుగా వెళ్తున్నా వాహనదారులతో కలిసి ఆందోళనకు దిగారు. లక్షలు వెచ్చించి కొన్న వాహనాల్లో కల్తీ పెట్రోల్ పోయడంతో అవి పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి రిపేర్లకోసం రూ. వేలల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మూడు నెలల క్రితం ఇదే పెట్రోల్ బంకులో కల్తీ పెట్రోల్ ఘటన వెలుగు చూసిందని వినియోగదారులు మండిపడ్డారు. పెట్రోల్ బంకుల నిర్వహణపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు కల్తీ పెట్రోల్‌ను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కందుకూరు వాసికి పురస్కారం

జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర్లుగుప్తాకు ఉత్తమ సేవా పురస్కారం



ప్రశంసాపత్రం అందుకుంటున్న వెంకటేశ్వర్లుగుప్తా

కందుకూరు: ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్తాకు జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఆయన గత 25 ఏళ్లుగా రంగారెడ్డితో పాటు పలు జిల్లాల్లో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గురువారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ని ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లుగుప్తా మాట్లాడుతూ.. పురస్కారం లభించడం తనపై బాధ్యతను మరింత పెంచినట్లయిందన్నారు. తనను అవార్డుకు ఎంపిక చేసినందుకు నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ ప్రెసిడెంట్ కృష్ణకుమార్, కోశాధికారి సత్యనారాయణ, ఎండీ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

తలకొండపల్లి: అతివేగంగా దూసుకొచ్చిన ఓ కారు రోడ్డు పక్కన ఆగి ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన ఆయిల్ సైదులు గురువారం రామాసిపల్లి మైసమ్మ ఆలయం వద్ద కల్లు అమ్ముకుంటున్నాడు. కల్లు దుకాణం పక్కన తన టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోటార్ సైకిల్‌ను ఉంచాడు. ఇంతలోనే మిడ్జిల్ నుంచి కారు అతి వేగంగా దూసుకు వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. కారులో జడ్చర్ల మండలం మురుగుపల్లి పెద్ద తండాకు చెందిన కేతావత్ రమేశ్‌గా పోలీసులు గుర్తించారు. సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలవ్వకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో ప్రజాస్వామిక హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ కవి, మంజీర రచయితల సంఘం వ్యవస్థాపకులు నందిని సిధారెడ్డి అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్‌వీకే, తెలంగాణ సాహితీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రజాస్వామిక విలువలు' అనే అంశంపై కవితా గోష్టి జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిధారెడ్డి మాట్లాడుతూ నేడు ప్రజాస్వామిక విలువలు అడుగంటుతున్నాయన్నారు. ప్రజల్లో వెలుగులు నింపేదానికి బదులు చీకటిని నింపడానికే సిద్ధాంతాలు ముందుకు వస్తున్నాయని విమర్శించారు. పువ్వులు, కాయలు, పండ్లల్లో కూడా మతం రంగు అద్దుతున్నారని విమర్శించారు.